మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# జిల్లాకు త్వరలో మరిన్ని పరిశ్రమలు..

### స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు :ఎక్సైజ్ శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,జూన్ 06 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లాకు త్వరలో మరిన్ని పరిశ్రమలు రాబోతున్నాయని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం శిల్పారామంలో ఏర్పాటు చేసిన తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదట హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తెలంగాణ వచ్చిన తరువాత మహబూబ్‌నగర్‌జిల్లాలో 758సూక్ష్మ, 105చిన్న, 23భారీ, 3మెగా తరహాపరిశ్రమలు జిల్లాలో ఏర్పాటుకానున్న మహబూబ్‌నగర్‌కు కొత్తగా అమర్‌రాజాబ్యాటరీస్ కంపెనీ వచ్చిందని దీనివల్ల ఎంతోమందికి ఉద్యోగాలు వస్తాయని, పక్క రాష్ట్రంలో పరిశ్రమలకు 14 నుండి 18 గంటలు కరెంటు మాత్రమే ఇస్తున్నారనికానీ తెలంగాణలో పరిశ్రమలకు 24 గంటల కరెంటును ఇస్తున్నామని అందుకే పెట్టుబడి పెట్టడానికి వారు ముందుకు వస్తున్నారని, అప్పులు కట్టలేక మూసివేసిన పరిశ్రమలను తెలంగాణలో మళ్లీ పున:ప్రారంభిస్తామని మంత్రి అన్నారు. తదనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ టిఎస్ ఐపాస్ ద్వారా వస్తున్న ఆన్‌లైన్ అప్లికేషన్లు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వాటికి అనుమతులు మంజూరు చేస్తున్నామని, జిల్లాలో చాలా పర్సనల్ పెట్టుబడి పెట్టడానికి ముందుకు వస్తున్నాయని జిల్లా కలెక్టర్ అన్నారు. పరిశ్రమల సూక్ష్మ, చిన్న, భారీ, మెగా పరిశ్రమలలో చక్కని ప్రతిభ కనబరిచిన వారిని మంత్రి ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ అధికారి జనరల్ మేనేజర్ బాబురావు, హ్యాండ్లూమ్స్ జెడి వెంకటేశ్వర్లు, ఇండస్ట్రియలిస్టులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# గద్వాల అనగానే నేసిన చీరలకు బ్రాండ్‌గా మారింది..!

### జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య

**గద్వాల ప్రతినిధి,జూన్ 06 ప్రభాతవార్త :** పరిశ్రమల స్థాపనకు జోగులాంబ గద్వాల జిల్లా అనువుగా ఉన్నదని పరిశ్రమలు స్థాపించి ఉపాధి పొందడమే కాక ఇతరులకు కూడా ఉపాధి కల్పిస్తుందని, గద్వాల అనగానే నేసిన చీరలకు బ్రాండ్‌గా మారిందని జిల్లా పరిషత్ ఛైర్మన్ సరిత అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్రఅవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పారిశ్రామిక ప్రగతి ఉత్సవాలు స్థానిక ఇండస్ట్రియల్ పార్కులో మురారి పరిశ్రమ ఆవరణలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి హాజరై జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక పరిశ్రమలు స్థాపించి అనేకమందికి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. టిఎస్ ఐపాస్ టి ప్రైడ్ ద్వారా పరిశ్రమలు స్థాపించి ఆర్థికంగా అభివృద్ధి సాధించామని తెలిపారు. చేనేత పరిశ్రమ ద్వారా చేనేత కార్మికులు లబ్దిపొందుతున్నారని ఆమె తెలిపారు. గద్వాల చీరలు ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయని, ఐటిశాఖ మంత్రి చొరవ చూపి చాలా పథకాలు తీసుకురావడం జరిగిందని, చేనేత రంగాన్ని ప్రభుత్వం మరింత అభివృద్ధి చేసిందని అన్నారు. నేతన్నకు చేయూత, చేనేత మిత్ర, నేతన్న భీమా తదితర కుల వృత్తులకు ఎన్నో పరిశ్రమలు స్థాపించి, పథకాల వల్ల చేనేత కార్మికులు లబ్దిపొందుతున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 9 సంవత్సరాలు పూర్తి చేసుకుని 10వ సంవత్సరాలు పూర్తి చేసుకుని, 10వ సంవత్సరంలో దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నామని, పరిశ్రమశాఖ చాలా అభివృద్ధిలో ఉందని అన్నారు. టిఎస్ ఐపాస్ సింగిల్‌విండో విధానం ద్వారా ఒకే దరఖాస్తు అన్ని శాఖల అనుమతి కోరుతూ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చుని తెలిపారు. టి ఐడియా టిప్రైడ్ విధానం ద్వారా పరిశ్రమలు స్థాపించి పారిశ్రామిక వేత్తలు కావాలని కలెక్టర్ తెలిపారు. – మిగతా4లో..



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్, జడ్పీ ఛైర్‌పర్సన్



దశాబ్ది ప్రగతి నివేదిక బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జడ్పీ ఛైర్‌పర్సన్

# పాలమూరు బంగారు తునక..!

పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం 80 వేల టీఎంసీలతో పాలమూరు బంగారు తునకలా మారుతుందని, ఆగస్టు నాటికి సాగునీరందించి ఈ ప్రాంతం మొత్తాన్ని సస్యశ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కలెక్టర్, ఎస్పీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభం అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకుంటే నాగర్‌కర్నూల్ జిల్లాగా ఏర్పడేదే కాదని, కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలు వచ్చేవా ప్రజలు ఆలోచించాలన్నారు. గతంలో పాలమూరు జిల్లాలో చాలా వెనకబాటు తనం, వలసలు, కరువుతో జిల్లా అల్లాడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు జిల్లా ప్రజల గోసను ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి ఇక్కడి నుంచి పోటీ చేస్తా అని ప్రొఫెసర్ జయశంకర్‌సార్‌ను అడిగానని, రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా పోటీ చేసినా ప్రజలు ఆదరిస్తారని చెప్పారని గుర్తుచేశారు. తాను పాలమూరు ఎంపీగా ఉండే తెలంగాణ సాధించడం చరిత్ర అని అది గొప్ప అనుభూతి అన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక ఐదు జిల్లాలకు ఐదు మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసుకున్నామని, గతంలో ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఒక్క మెడికల్ కళాశాల కూడా తేలేదన్నారు. భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలను పూర్తి చేశామని, అచ్చంపేటలోని ఉమామహేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.2వేల కోట్లు కేటాయించామన్నారు. 20లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు.



భహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

- ఎత్తిపోతల పథకంతో సస్యశ్యామలం చేస్తాం..
- ఆగస్టు నాటికి వట్టెం, కర్వెనకు నీళ్లందిస్తాం..
- గతంలో 64 మండలాలు ఉండే..నేడు 76 మండలాలు చేశాం..
- ధరణి లేకుంటే అన్నదాతలు ఆగమే..
- గృహలక్ష్మి పథకంతో రూ.3లక్షలు అందజేస్తాం..
- బీసీ కుటుంబాలకు రూ.లక్ష ఆర్థికసాయం
- నాగర్‌కర్నూల్ బహిరంగ సభలో సీఎం కేసీఆర్



సీఎం కేసీఆర్‌కు నాగలిని బహుకరిస్తున్న ఎమ్మెల్యే మర్రి, మంత్రి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్6, ప్రభాతవార్త :** 10,15 వేల రూపాయలకే ఎకరా పొలం అమ్ముకున్న పాలమూరులో నేడు ఎకరాకు రూ. కోటి, రెండు కోట్లు పలుకుతుందంటే చాలా ఆనందంగా ఉందన్నారు. గతంలో ఆంధ్రా నాయకులు తెలంగాణ ఏర్పడితే రాష్ట్రంలో చిమ్మచీకట్లు ఉంటాయన్నారు..కానీ నేడు ఆంధ్రాలో చీకట్లు ఉన్నాయని తెలంగాణ నిరంతరంగా వెలుగులతో విరాజిల్లుతుందన్నారు. తొమ్మిదేండ్లలో కరోనా, నోట్ల రద్దుతో రెండున్నరేండ్లు ఇబ్బందులు పడినా అతి తక్కువ కాలంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించామన్నారు. తెలంగాణ నేడు అన్ని రంగాల్లో నెంబర్ వన్‌గా ఉందన్నారు. తలసరి ఆదాయం, తలసరి విద్యుత్ వినియోగం, సంక్షేమానికే రూ.50వేల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం దేశంలో తెలంగాణ ఒక్కటే ఉందన్నారు.

ఇటీవల జడ్చర్లలో జరిగిన కాంగ్రెస్ సభలో ఓ నేత మాట్లాడుతూ ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తాం అంటున్నారని ధరణి లేకపోతే మళ్లీ అన్నదాతలు ఆగం అయితారని సీఎం స్పష్టం చేశారు. నేడు రైతు భూమిని బదలాయింపు చేసే హక్కు కేవలం ఒక్క రైతుకు మాత్రమే ఇచ్చామని, ఏ అధికారికి ఆఖరుకు సీఎంకు కూడా ఆ అధికారం లేదన్నారు. రైతుబంధు, రైతుబీమాతో సహా, వడ్ల కొనుగోలు డబ్బులు కూడా ఎలాంటి మధ్యవర్తి లేకుండా రైతుల ఖాతాల్లో పడుతున్నాయంటే ధరణి వల్లే అన్నారు. ధరణి తీసేస్తే మళ్లీ పాత పద్ధతిలో తిప్పలు తప్పవన్నారు. రోజుల తరబడి కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తూ, లంచాలు ముట్టచెబుతూ నానా అవస్థలు పడే రోజులు మళ్లీ తెచ్చుకుందామా.. ధరణితో దర్జాగా ఉందామా అని ప్రశ్నించారు. ధరణిని బంగాళాఖాతంలో పడేయం కాదు.. కాంగ్రెస్ నేతలను బంగాళాఖాతంలో పడేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వలసలతో అల్లాడిన పాలమూరు నేడు పచ్చని పైట కప్పుకొన్నట్లు ఎటూ చూసినా దుందుభీ పొడవునా చెక్ డ్యాంలలో జలకళ సంతరించుకున్నదన్నారు. త్వరలోనే గృహలక్ష్మి పేరుతో ఇల్లు లేని పేదలు జాగా ఉంటే ఇల్లు నిర్మించుకోవడానికి రూ.3లక్షల పథకం తీసుకొస్తామని నియోజకవర్గానికి 3వేల మందికి అందజేస్తామన్నారు. పాలమూరు జిల్లాలోని నియోజకవర్గాలకు మాత్రం 4వేల చొప్పున కేటాయిస్తామని హామీ ఇచ్చారు. బీసీ కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి రూ.లక్ష ఆర్థికసాయం అందించే కార్యక్రమాన్ని నెలలో ప్రారంభిస్తామన్నారు. నేడు తెలంగాణ పథకాలు,తెలంగాణ – మిగతా4లో..



సీఎం కేసీఆర్‌కు నాగలిని బహుకరిస్తున్న ఎమ్మెల్యే మర్రి, మంత్రి

# నూతన పారిశ్రామిక ఔత్సాహికులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది..

- ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి...
- మార్కెట్‌లో డిమాండ్ ఉన్న రంగాలను ఎంచుకుని పరిశ్రమలుగా స్థాపించి అభివృద్ధి చెందాలి
- టీఎస్ ఐపాస్ ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు రూ.1936.24 కోట్ల పెట్టుబడితో 143 యూనిట్లకు అనుమతి
- తెలంగాణ పారిశ్రామిక ప్రగతి వేడుకలలో జడ్పీ ఛైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి , జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్



కార్యక్రమానికి హాజరైన చేనేత కార్మికులు, పారిశ్రామిక ఔత్సాహికులు



మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి ,కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



చేనేత దుస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి,జూన్6,ప్రభాతవార్త:** ప్రభుత్వం నూతన పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తు, పరిశ్రమల అభివృద్ధికి చేయూత అందిస్తుందని జిల్లా పరిషత్ ఛైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఐడివోసి సమావేశ మందిరంలో తెలంగాణ పారిశ్రామిక ప్రగతి వేడుకలకు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీఎస్ ఐపాస్ ద్వారా పరిశ్రమల స్థాపనలు, అనుమతులకు సులభతరం అయ్యిందని ఆయన అన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో పెట్టుబడులు పెరిగాయని, నూతన పారిశ్రామిక ఔత్సాహికులను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని ఆయన అన్నారు. భారీగా పరిశ్రమలు అభివృద్ధి చెందినట్లయితే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ఆయన తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, పేపర్ ప్లేట్ల తయారు చేయడం, ఆయిల్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయడం, ఆహార ఉత్పత్తుల తయారీ వంటి మార్కెట్‌లో డిమాండ్ ఉన్న రంగాలను ఎంచుకుని పరిశ్రమలుగా స్థాపించి, అభివృద్ధి చెందాలని ఆయన అన్నారు. పరిశ్రమల అనుమతులు పూర్తిగా ఆన్‌లైన్ విధానం ద్వారా చేపడుతున్నట్లు ఎక్కడ ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే పెట్టుబడులు అందించుటకు ఈ విధానం దోహదపడుతుందని ఆయన తెలిపారు. టీఎస్ ఐపాస్ ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు రూ.1936.24 కోట్ల పెట్టుబడితో 143 యూనిట్లకు అనుమతులు ఇవ్వడం జరిగిందని, 4022 మందికి ఉపాధి కల్పించనున్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నూతన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ద్వారా మరో నలుగురికి ఉద్యోగ, ఉపాధి అవకాశం కలుగుతుందని ఆయన సూచించారు. డిమాండ్ ఉన్న లాభదాయకమైన యూనిట్లను ఎంపిక చేసుకోవాలని, ఎంచుకున్న యూనిట్లపై నైపుణ్యత కలిగి ఉండాలన్నారు. నిత్యవసర వస్తువులైన నూనెలు, పప్పులు వంటి ఆహార పదార్థాలను ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకోకుండా మన రాష్ట్రంలోనే పండించి, వాటిని ప్రాసెసింగ్ చేసి, పరిశ్రమలుగా నెలకొల్పి మనకు అవసరమైన నిత్యవసర వస్తువులను మనమే తయారు చేసుకున్నట్లయితే చౌకధరకు దొరకడమే కాకుండా నాణ్యత కలిగి ఉంటాయని ఆయన అన్నారు. త్వరలో మన జిల్లాలో ఆయిల్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. టీ ఐడియా పథకం ద్వారా ఇప్పటి వరకు పది దరఖాస్తులకు గాను రూ.1.53 కోట్లు రాయితీలు మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. టీ ప్రైడ్ పథకం ద్వారా ఇప్పటి వరకు షెడ్యూల్ కులాలకు 575 యూనిట్లు, షెడ్యూల్ తెగలకు 876 యూనిట్లు, దివ్యాంగులకు 124 యూనిట్లు మంజూరు చేసి, ఎస్సీలకు రూ.31.95 కోట్లు, ఎస్టీలకు రూ.45.67 కోట్లు , దివ్యాంగులకు రూ.8.30 కోట్లు రాయితీలు అందించినట్లు ఆయన తెలిపారు. యువత కష్టపడి పని చేసే మనస్తత్వాన్ని అలవర్చుకోవాలని, అప్పుడే ఏ రంగంలో అయినా అభివృద్ధి సాధిస్తారని యువతకు ఆయన సూచించారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో తెలంగాణ వృద్ధి రేటు చాలా ఎక్కువగా ఉన్నదని, ఇది శుభపరిణామమని ఆయన అన్నారు. తయారీ రంగంలో నూతన – మిగతా4లో..

# రైతన్న కన్నీరు కనిపించడం లేదా..?

- గడిల పాలనకు స్వస్తి పలుకుదాం...
- నీళ్లు, నిధులు, నియామకాలు ఏమయ్యాయి...
- భూ నిర్వాసితుల గోడు పట్టదా.?
- భూ నిర్వాసితులకు పరిహారమివ్వడంలో జాప్యమెందుకు
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



సిద్దాపూర్‌లో కొనసాగుతున్న పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో భట్టి విక్రమార్క



సిద్దాపూర్‌లో కొనసాగుతున్న పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో భాగంగా ప్రసంగిస్తున్న దృశ్యం



సిద్దాపూర్‌లో కొనసాగుతున్న పీపుల్స్‌మార్చ్ పాదయాత్రకు కొలాటాలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

**అచ్చంపేట, జూన్ 06 ప్రభాతవార్త:** ప్రాజెక్టుల నిర్మాణం పేరిట భూమిని నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్న రైతుల వద్ద బలవంతంగా భూములను లాక్కొని కాలువలు తీసి పరిహారం అందిస్తామని రైతులను నమ్మబలికి పరిహారమివ్వకుండా జాప్యం చేయడంతో రైతన్నలు కన్నీరు మున్నీరై విలపిస్తున్నారు, భూమిపై పరిహారం అందక బతుకు భారమై వలసలు వెళ్లలేక, చావలేక, బ్రతకలేక అంటూ ఉన్న కాస్త భూమిలో గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తూ కాలం వెల్లదీస్తున్న రైతన్నల అర్ధనాధాలు ప్రభుత్వానికి కనిపించడం లేదా అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ప్రశ్నించారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా మంగళవారం అచ్చంపేట నియోజకవర్గంలోని సిద్దాపూర్ మండలంలో పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్కను పాదయాత్రలో మర్లపాడు గ్రామానికి చెందిన రెడ్యానాయక్, రైతులు హన్మంత్‌నాయక్, భోజ్యానాయక్, జగన్‌నాయక్, సత్యనాయక్, రామ్లీనాయక్, రమేష్ భూములు కోల్పోయి అవస్థలు పడుతున్న గోడును బోరున విలపిస్తూ మమ్మల్ని ఆదుకోవాలంటూ కన్నీరు మున్నీరై వేడుకున్నారు. నక్కలగండి రిజర్వాయర్ ప్రాజెక్టు క్రింద భూములు కోల్పోతే అక్కడి నుంచి పొట్ట చేతపట్టుకొని గుడిసెలు వేసుకొని బ్రతుకుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఎకరాల భూమి మునిగిపోతే వారిచ్చిన పరిహారం డబ్బులు 4ఎకరాలు మాత్రమే వచ్చిందని, భూమిని కొనుగోలుచేసి ఇక్కడే గుడిసెలు వేసుకొని వ్యవసాయం సాగు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నామని భట్టికి విన్నవించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకెజీ క్రింద తమకు ఎలాంటి పరిహారం అందలేదని,గాలి,వాన,ఎండకు ఎండిపోతున్నామని,గుడిసెలను చూపిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి వెబ్‌సైట్ ద్వారా 105 సంవత్సరాలుగా కాస్తులో ఉన్న వంశోద్ధారకుల పేర్లు లేకుండా మాయం చేసి రైతు నోట్లో మట్టికొట్టారని పేర్కొన్నారు. కాయకష్టం చేసుకొని బ్రతికేవాళ్లకు కేసులంటే ఏమిటో తెలియని, మా భూములకు మాకు ఇప్పించాలంటూ భట్టి ముందు బోరున విలపించారు.

**గడిల పాలనకు స్వస్తి పలుకుదాం...**

అమరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ కబంద్ధ హస్తాలలో బంది చేసి నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దొరల దాసోహానికి బలి చేస్తున్న కేసీఆర్ అధికార అహంకారాన్ని బద్దలు కొట్టి తెలంగాణ తల్లిని దొరల గడిల నుంచి విముక్తి పర్చేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు, తెలంగాణ ప్రజలు ముక్తకంఠంతో ఏకమవుతున్నారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క హెచ్చరించారు. ఆంధ్రా వలస పాలకుల పాలనలో తెలంగాణ ఆగమైందని, ప్రగల్భాలు పలికి తెలంగాణ ప్రజలను రెచ్చగొట్టి బలిదానాలు చేసుకునే విధంగా ప్రేరేపించి ఎందరో ప్రాణాలను బలిగొన్న కేసీఆర్‌కు అమరుల కుటుంబాలపై చిత్తశుద్ధి లేకుండా నేటికి కూడా పట్టించుకున్న పాపన పోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే నీళ్లు, నిధులు, నియామకాలు మనమే చేసుకోవచ్చునని, ఎవరో పెట్టిన భిక్షకు తెలంగాణ ప్రజలు ఎదురు చూడాల్సిన అవసరం లేదని మాట్లాడిన అనాటి మాటలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రం సిద్దించి సుమారు 10 సంవత్సరాలు కావస్తున్న కొలువులు లేకపోవడం వల్ల పట్టాలు చేతిలో పట్టుకొని నిరుద్యోగులు రోడ్లపై తిరగాల్సిన దుస్థితిని సీఎం కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రావలస పాలకుల పాలనలో తెలంగాణ ప్రజలు నలిగిపోతున్నారని, ఉద్యమ సమయంలో రెచ్చగొట్టి నేడు అదే ఆంధ్రా పాలకులతో చేతులు కలిపి తెలంగాణలో నిర్వహించే పనులకు కాంట్రాక్టులు ఇచ్చి తెలంగాణ ప్రజలను ఆగం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ వస్తే మంచిరోజులు వస్తాయని ఆత్మబలిదానాలు చేసుకున్న అమలరు ఆత్మఘోష విలపిస్తుందని, తెలంగాణ ప్రజల అకాంక్ష నేరవేర్చడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబంలో కొలువులు కల్పించుకొని రాష్ట్ర ప్రజలకు కొలువులు లేకుండా చేసి నిరుద్యోగులుగా మారిన యువతకు రూ.3వేల నిరుద్యోగ భృతి అందిస్తామని ఆశలు చూపించి నేటికి కూడా అమలు చేయకపోవడంతో యువత బ్రతుకు భారమై కాలం వెల్లదీస్తున్న పరిస్థితులు నెలకొన్నాయని ఆయన అన్నారు. దళితులకు మూడు ఎకరాల భూమిని అందించి వారి అభివృద్ధికి కృషి చేస్తామన్న మాటలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్లలో అల్లుడు వస్తే ఎక్కడ పడుకోవాలని హేళన చేసి డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ప్రజలకు అండగా ఉంటానన్న మాటలు మోసపూరితమేనా, ఎన్నికల్లో గద్దెనెక్కేందుకే మాయమాటలు చెప్పి ప్రజలను మోసగించి పరిపాలన కొనసాగించాలనే కుట్రలు పన్నుతున్న కేసీఆర్‌కు తగిన బుద్ధి చెబుతామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, మాజీ ఎంపీ మల్లు రవి, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ముకురాల గ్రామంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ పర్యటన...

**కల్వకుర్తి, జూన్ 06 ప్రభాతవార్త:**కల్వకుర్తి మండలం ముకురాల గ్రామంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్‌ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి గురువారం మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా పర్య టించారు. గ్రామంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురిని పరామర్శించి ఆరోగ్య పరి స్థితిని అడిగి తెలుసుకొని బాధిత కుటుంబాలకు భరోసా కల్పించారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్య, వైద్యం, ఉపాధి అనే నినాదంతో ముందుకు సాగుతున్నట్లు ఐక్యతఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడు



ముందుంటానని ఆయన పేర్కొన్నారు. గ్రామానికి విచ్చేసిన చైర్మన్ రాఘవేందర్‌రెడ్డిని గ్రామ మహిళలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ప్రతాప్‌రెడ్డి, ముకురాల సతీష్, మల్లేష్, రహీమ్, భరత్, కొత్త లక్ష్మారెడ్డి, మహేష్, నరేష్, సాయి, ప్రశాంత్, రాజు, మల్లేష్, కంచ మల్లేష్, బత్తుల రాజు, దస్తగీర్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## కుస్తీ వీరులపైన లైంగిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం...

**-బీఆర్ఎస్ జాగృతి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు దారమోని గణేష్**

**కల్వకుర్తి, జూన్ 06 ప్రభాతవార్త:**ఢిల్లీలో మహిళా రెజ్లర్ల మీద బీజేపీ ఎంపీ బ్రిడ్జ్ భూషణ్ చరణ్‌సింగ్ లైంగిక దాడికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ జాగృతి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు దారమోని గణేష్ పేర్కొన్నారు. దేశంలో మహిళా రెజ్లర్లకే భద్రత లేదని, అలాంటిది సామాన్యమైన మహిళలకు రక్షణ ఎలా ఉంటుందని ఆయన



ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వంలో మహిళా రక్షణ పట్ల తీవ్రంగా విఫలమైందని, ఇప్పటికే భారత జాగృతి తరుపున ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో మహిళా సాధికారత, మహిళ హక్కుల గురించి, మహిళా చట్టాల గురించి ఢిల్లీ వేదికగా పలుమార్లు ఉద్యమాలు, ధర్నాలు చేపట్టారని ఆయన గుర్తు చేశారు. రెజ్లర్లపై లైంగిక దాడికి పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిడ్జ్ భూషణ్ చరణ్‌సింగ్ వెంటనే బహిరంగ క్షమాపణలు కోరాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యాదయ్య, శివ, జోగు విష్ణు, మహేష్, రమేష్ తదితరులు ఉన్నారు.

## సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ...

**కల్వకుర్తి, జూన్06 ప్రభాతవార్త:**వెల్దండ మండలం కొట్ర గ్రామానికి చెందిన సర్పంచ్ పొనుగోటి వెంకటేశ్వర్‌రావు తండ్రి జంగారావు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. సోమవారం సర్పంచ్ కుటుంబాన్ని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ పరంగా కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. అదే విధంగా ఎన్.శ్రావణికి



మంజూరైన రూ.11వేలు, ఆర్.లక్ష్మమ్మకు రూ.22వేలు, శ్రీకాంత్‌రెడ్డి రూ.18వేలు, సత్తయ్యకు మంజూరైన రూ.56వేల చొప్పున మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో గోళి సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## నిరంకుశ పాలనను గద్దె దించేందుకే కాంగ్రెస్‌లో చేరికలు...

**-సీఎల్పీ నేత భట్టి విక్రమార్క...**

**అచ్చంపేట, జూన్ 06 ప్రభాతవార్త:**రాష్ట్రంలో కొనసాగుతున్న నిరంకుశ పాలనలో విసుగు చెందిన ప్రజలు సొంత పార్టీ కార్యకర్తలనే విస్మరించి ధనార్జనే ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వ నిరంకుశ తత్వాన్ని గద్దె దించడానికే బీఆర్ఎస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని సీఎల్పీ నేత



భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్ పాదయాత్రలో భాగంగా మంగళవారం అచ్చంపేట మండలం దండ్యాలం తాండ గ్రామంలో 60 మంది బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి సీఎల్పీ నేత భట్టి విక్రమార్క సమక్షంలో డీసీసీ అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆధ్వర్యంలోకాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అచ్చంపేట నియోజకవర్గంలో డాక్టర్ వంశీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఆయన సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అలిసిపోయిన ప్రతి పౌరుడు కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసి రాష్ట్ర ఫలాలను దక్కించుకునేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు.

## ఓటమి భయంతోనే అక్రమ అరెస్టులు...

**-అచ్చంపేట బీజేపీ నేత శ్రీకాంత్ భీమా...**

**అచ్చంపేట, జూన్ 06 ప్రభాతవార్త:**రాష్ట్రాన్ని అభివృద్ధి పరిచి ప్రజలకు అందుబాటులో ఉన్న నేతలు సమావేశాలు ఏర్పాటు చేసుకుంటే ప్రతిపక్షాలను ఎందుకు ముందస్తు అరెస్ట్ చేశారని, తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా అభివృద్ధిని కుంటు పట్టించినందుకే ఓటమి భయంతో ఎక్కడ ప్రతిపక్షాలు అడ్డుకుంటారనే నెపంతో పోలీసులతో అరెస్టులు చేయించినంత మాత్రన ప్రజల్లో



ఉన్న ఆగ్రహావేశాలు పెరుగుతాయే తప్ప తరగదని, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అచ్చంపేట బీజేపీ నేత శ్రీకాంత్ భీమా హెచ్చరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభను దృష్టిలో పెట్టుకొని బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి విలసాలు చేస్తున్న బీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రికి పోలీసులు లేకుండా ప్రజల్లోకి వెళ్లే ధైర్యం లేకనే అక్రమ అరెస్టులు చేయిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులు చేసినంత మాత్రన అభివృద్ధి జరుగుతుందా అని ఆయన ప్రశ్నించారు. శ్రీకాంత్ భీమాతో పాటు అచ్చంపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని బీజేపీ నేతలను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు.

## బహిరంగ సభకు బయలుదేరిన బిఆర్ఎస్ నాయకులు

**మూసాపేట, జూన్ 06 ప్రభాతవార్త :** మూసాపేట మండల కేంద్రంతో పాటు వేముల, సంకల్‌మద్ది, దాసరిపల్లి, జానంపేట, నందిపేట, అచ్చయ్యపల్లి, చక్రాపూర్, పోల్కంపల్లి, నిజలాపూర్, మహ్మద్ హుస్సేన్‌పల్లి గ్రామాల నుండి నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగే ముఖ్యమంత్రి కెసిఆర్ బహిరంగ సభకు భారీగా బిఆర్ఎస్ నాయకులు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమలో ఎంపిపి గుపని కళావతి కొండయ్య, జడ్పీటిసి ఇంద్రయ్యసాగర్, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎండి జమీర్, టిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు అచ్చాయపల్లి సర్పంచ్ చంద్రశేఖర్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, మహిళలు, కార్యకర్తలు, నాయకులు తదితరులు బయలుదేరి వెళ్లారు.

## 10వ రోజుకు చేరిన బాధిత లబ్దిదారుల నిరసనదీక్ష

**దేవరకద్ర, జూన్ 06 ప్రభాతవార్త:** దేవరకద్రలో స్థానిక శ్రీ ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్ బాధిత లబ్దిదారులు చేస్తున్న నిరసనదీక్ష మంగళవారం నాటికి 10వరోజుకి చేరింది. ఈ నిరసనదీక్షలను బాధిత లబ్దిదారులు గత నెల 28న ప్రారంభించారు. అయితే ఈ సమస్యను ఎవరు పట్టించుకోకపోవడంతో వారు మళ్ళీ నిరసనదీక్ష చేపట్టిన విషయం విధితమే. ఈ సందర్బంగా బాధిత లబ్దిదారులు ప్రసంగించారు. 2019లో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోనున్న శ్రీ ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవస్థానానికి



సంబందించిన స్థలంలో 54 షాపులు నిర్మిస్తామని 54 కుటుంబాల వారితో ఒక్కొక్కరితో దాదాపు రూ.4లక్షల చొప్పున డిడిలు తీసుకున్నారన్నారు. అయితే ఇంతవరకు దాదాపు 4 ఏళ్ళు గడుస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులు పూర్తి చేయలేదని వారు ఆవేదన వ్యక్తపరిచారు. దీని గురించి ఎవరు కూడ పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, సంబందిత అధికారులు పట్టించుకొని వెంటనే మా సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్బంగా లబ్దిదారులు పెద్దఎత్తున నినాదాలిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్ బాధిత లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# అద్దె చెల్లించలేదని ఎంపీడీవో కార్యాలయానికి తాళం..!

- **మూడు లక్షల అద్దె చెల్లించాలని పట్టుబట్టిన యజమాని**
- **రెండు గంటల వరకు కార్యాలయం బయటనే సిబ్బంది**
- **లక్ష రూపాయలు రెండురోజుల్లో ఇస్తామని ఎంపీపీ మామ చుక్క చిన్న ఆశిరెడ్డి హామీ**
- **రెండు గంటల తరువాత తాళం తెరిచిన యజమాని గంగారం**





ఎంపీడీవో కార్యాలయానికి తాళం వేస్తున్న ఇంటి యజమాని గంగారం

**అమరచింత, జూన్6, ప్రభాతవార్త:** ఓ పక్క తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం అద్దె చెల్లించాలని ఇంటి యజమాని గంగారం ఉదయం 10 గంటలకు కార్యాలయానికి వచ్చి తాళం వేశాడు. ఈ సంఘటన పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. అయితే గతంలోను గంగారం అద్దె చెల్లించాలని పట్టుబట్టగా అప్పుడు అధికారులు అద్దె చెల్లిస్తామని హామీ ఇచ్చి ఎలాగో తాళం తెరిపించారు. అయితే అప్పటి నుండి ఇప్పటి వరకు ఇంటి అద్దెపై అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో మంగళవారం ఇంటి యజమాని గంగారం మరో సారి కార్యాలయానికి తాళం వేశాడు. దశాబ్ది ఉత్సవాలకు వెళ్లేందుకు సిబ్బంది కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే కార్యాలయం తాళం ఉండడంతో ఏమీ పాలుపోక చెట్ల కింద ఉండిపోయారు. ఎంపీపీ చుక్క మాలతి మామ చుక్క చిన్న ఆశిరెడ్డి అధికారులతో సమన్వయం చేశారు. దాదాపు మూడు గంటల పాటు గంగారంతో చర్చలు జరిపారు. చివరికి లక్ష రూపాయలు రెండు రోజుల్లో ఇస్తామని మాట ఇవ్వడంతో ఇంటి యజమాని గంగారం శాంతించి కార్యాలయం తలుపులు తెరిచాడు. అయితే గతంలోను మంత్రి నిరంజన్‌రెడ్డి అమరచింత పర్యటన అప్పుడు కార్యాలయానికి తాళం పడింది. సోమవారం మంత్రి నిరంజన్‌రెడ్డి అమరచింత పర్యటకువచ్చినప్పుడు రెండోసారి కార్యాలయానికి తాళం పడింది.

## జిల్లాలో వైఎస్ఆర్‌తెలంగాణ పార్టీని బలోపేతం చేస్తాం..

**- మహబూబ్‌నగర్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన జిల్లా అధ్యక్షుడు మందడి సరోజ్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 6, ప్రభాతవార్త :** జిల్లాలో వైఎస్ఆర్‌తెలంగాణ పార్టీని బలోపేతం చేస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు మందడి సరోజ్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్‌లోని టీటీడీ కల్యాణమండపం సమీపంలో వైఎస్ఆర్‌తెలంగాణ పార్టీ (వైఎస్ఆర్‌టీపీ) మహబూబ్‌నగర్ జిల్లా నూతన కార్యాలయం మంగళవారం ఆయన ప్రారంభించారు. ముందుగా కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పార్టీ అధ్యక్షురాలు షర్మిలమ్మ నిరంతరం పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి షర్మిలమ్మ రాష్ట్రంలో 3800 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టినట్లు చెప్పారు. నిరుద్యోగం, రైతు సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తూ దీక్షలు సైతం చేపట్టినట్లు గుర్తుచేశారు. ఇదే బాటలో ఇక మీదట పార్టీ కార్యక్రమాలు జిల్లాలో విస్తృత స్థాయిలో చేపట్టనున్నట్లు వెల్లడించారు. త్వరలో



వైఎస్ఆర్‌టీపీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మందడి సరోజ్‌రెడ్డి

అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నట్లు సరోజ్ రెడ్డి వెల్లడించారు. నియోజకవర్గ స్థాయిలో ఎక్కడికక్కడే పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈమేరకు పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ జడ్చర్ల కో ఆర్డినేటర్ మరియమ్మ, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి బీడీ శామ్యూల్, ఉపాధ్యక్షుడు ముకుందాచారి, పట్టణ అధ్యక్షుడు మహేందర్‌జి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కాట్రావత్ ఆనంద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గద్దం యాదయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు మహేందర్, అభిలాష్ యాదవ్, రఘురెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి ఉత్సవాలు నిర్వహించే నైతిక హక్కు లేదు

**- కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలి**

**- సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా వనపర్తి జిల్లా కార్యదర్శి నందిమల్ల ఎంపీటీసీ హనుమంత్ డిమాండ్**

**అమరచింత, జూన్6, ప్రభాతవార్త:** అమరచింత మండల పరిధిలోని మస్తిపూర్, నందిమల్ల, కిష్టంపల్లి ఎక్స్ రోడ్డు గ్రామాలలో పార్టీ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో ఆర్భాటాలు నిర్వహిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి కేసీఆర్‌కు ఉత్సవాలు నిర్వహించే నైతిక అర్హత లేదని ప్రజల ఆకాంక్షలు నెరవేర్చని ప్రభుత్వానికి ఆ హక్కు లేదని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి హనుమంతు అన్నారు. సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర ఏడవ మహాసభ పిలుపు మేరకు మంగళవారం గ్రామాలలో ప్రచారం నిర్వహించి మాట్లాడుతూ... గడిచిన 10 సం.ల కాలంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని నిరుద్యోగాన్ని పెంచిందని ఐదు లక్షల కోట్ల అప్పులు చేసి ప్రజల నెత్తిన భారం మోపిందని కాంట్రాక్టు వ్యవస్థ ఉండదని చెప్పిన కేసీఆర్ క్రమబద్ధీకరణ చేయడంలో విఫలమయ్యాడని డబుల్ బెడ్ రూమ్ ఇవ్వడం లో కేసీఆర్ మోసం చేశాడని రైతులకు రుణమాఫీ చేయకుండా రైతాంగాన్ని మోసం చేశాడని పోడు భూములకు పట్టాలిస్తానని చెప్పి కా లయాపన చేస్తు ప్రజల్ని మభ్యపెడుతూనే ఉన్నాడని అర్హులైన వారందరికీ రేషన్ కార్డు ఇవ్వడంలో విఫలమయ్యాడని ప్రతి నియోజకవర్గం లో లక్ష ఎకరాలకు నీరు అందిస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదని హామీల ప్రభుత్వంగా మారిందని నీళ్లు, నిధులు, నియామ కాల కోసం తెలంగాణ ఉద్యమం కొనసాగిందని రాష్ట్ర సాధన ఉద్యమంలో సబ్బండ వర్గాలు పాల్గొన్నాయని తెలంగాణ వచ్చిన తరువాత కష్టాలు కన్నీలు, ప్రజలకు మిగిలాయన్నారు. ఈనెల 8న అమరచింత మండల తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా, 12వ తేదీన వనపర్తి జిల్లా కేంద్రంలో దీక్ష దివాస్‌ను నిర్వహిస్తున్నామని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా డివిజన్ నాయకులు రాజు, అచల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాజన్న, ఐఎఫ్‌టీయు జిల్లా నాయకులు సామెలు, సీడీఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, పార్టీ ప్రజా సంఘాల నాయకులు రాజు, శ్రీను, రాజు, మురళి, బాబు, మన్యం, అంజి, జనార్ధనమ్మ ,శైలజ, మహేశ్వర, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు

## డీఎంఆర్ ట్రస్టు ద్వారా క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ

**అమరచింత, జూన్6, ప్రభాతవార్త:**అమరచింత మున్సిపాలిటీ పరిధిలోని డీఎంఆర్ ఆసుపత్రిలో డీఎంఆర్ ట్రసుట ద్వారా క్షయ వ్యాధిగ్రస్తులకు 8 నెలల వరకు ఉచితంగా పప్పు, మంచి నూనె, పాలు , గుడ్లుతో కూడిన పౌష్టికాహార కిట్లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ... క్షయవ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. మండల వైద్యాధికారులు డాక్టర్ నిస్సార్ హైమద్ మాట్లాడుతూ... క్షయ వ్యాధిగ్రస్తులకు పలు జాగ్రత్తలు సూచించారు. వారం రోజుల కంటే ఎక్కువగా దగ్గు వస్తున్న తెమడ తో పాటు రక్తం పడితే వెంటనే వైద్యులను సంప్రదించి టీబీ పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రమాదం నుండి కోలుకునే అవకాశం ఉందన్నారు. రోగ లక్షణాలు కనబడితే కుటుంబ సభ్యులతో పాటు ఇతరులతో మాట్లాడుతున్న సందర్భంలో మాస్కు ధరించాలని డాక్టర్ నిస్సార్ హైమద్ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారులు డాక్టర్ నిస్సార్ హైమద్, డాక్టర్ దీపిక, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్ గౌడ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా యూత్ కమిటీ సభ్యుడు శ్యామ్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటరెడ్డి, స్టాఫ్ నర్సు శ్రీదేవి ఆశా వర్కర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న డీఎంఆర్ ట్రస్టు సభ్యులు

## సీఎం భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి

**కెటిదొడ్డి, జూన్ 06 ప్రభాతవార్త :** గద్వాల నియోజకవర్గం కెటిదొడ్డి మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈనెల 12వ తేదీన సీఎం కెసిఆర్ గద్వాల పర్యటన సందర్భంగా గద్వాల జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం, జిల్లా ఎస్పీ కార్యాలయం, బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవాలకు విచ్చేస్తున్నారు. అదేవిధంగా మధ్యాహ్నం 3 గం.లకు గద్వాల జిల్లా కేంద్రంలోని అయిజ రోడ్డు దగ్గర జరిగే భారీ బహిరంగ సభను 20 వేలుపైగా మందిని బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు, ప్రజలు, రైతులు మహిళలు గ్రామగ్రామాల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సీఎం సభకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి రాజశేఖర్, వైస్ ఎంపిపి రామకృష్ణ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు ఉరుకుందు, రైతుబంధు సమితి అధ్యక్షుడు హనుమంతు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, సింగిల్ విండో డైరెక్టర్ రఘుకుమార్‌శెట్టి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు చక్రధర్‌రావు, సర్వారెడ్డి, శేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాజేష్, నవీన్‌రెడ్డి, వెంకటన్నగౌడ్, వెంకటేష్‌గౌడ్, జిందప్ప, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

## నాగమ్మకు డబుల్ బెడ్రూం ఇల్లు కేటాయించండని డీటీకి వినతి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 6, ప్రభాతవార్త :** జడ్చర్ల పట్టణాని కి చెందిన పేద దళిత కుటుంబానికి చెందిన నాగమ్మకు డబుల్ బెడ్రూం ఇల్లు కేటాయించాలని బీజేపీ ఎస్సీ మోర్చా పాలమూరు జిల్లా అధ్యక్షుడు కొంగలి శ్రీకాంత్ ఆధ్వర్యంలో జడ్చర్ల డిప్యూటీ తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇస్తామని చెప్పి ఇండ్ల కేటాయింపుల్లో అన్యాయం చేశారని ఆరోపించారు. ఈమేరకు డీటీకి వినతిపత్రం ఇవ్వగా నాగమ్మకు ఇల్లు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్చర్ల పట్టణ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు జగదీశ్, ప్రధాన కార్యదర్శి పవన్, ఉపాధ్యక్షుడు కే శివ, కార్యదర్శి చైతన్య, నాయకులు కృష్ణ పాల్గొన్నారు.



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు

## దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌ధరలు

**దేవరకద్ర, జూన్ 06 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం 15 కింటాళ్ళ సోన ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. అయితే కింటాల్ సోన ధాన్యానికి అత్యధికంగా రూ.2100 ధర పలికింది. అలాగే అతి తక్కువగా కూడ అంతే ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## సీఎం బహిరంగ సభకు తరలిన ప్రజలు...

**వెల్దండ, జూన్06 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్ వస్తున్న నేపథ్యంలో నిర్వహించనున్న బహిరంగ సభకు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామ



సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వాహనాల్లో సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీపీ విజయజైపాల్‌నాయక్, జెడ్పీటీసీ ధ్యావ విజితారెడ్డిలతో కలిసి యెన్నం భూపతిరెడ్డి మాట్లాడుతూ కోట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ 9 సంవత్సరాల సుదీర్ఘ పాలనలో ప్రజారంజక సంక్షేమ పథకాలు చేపట్టి దిగ్విజయంగా అమలు చేస్తున్నారన్నారు. దశాబ్ధి ఉత్సవాల్లో భాగంగా సీఎం కేసీఆర్ నాగర్‌కర్నూల్ జిల్లాకు రావడం ఎంతో శుభపరిణామమన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అఖండ మెజార్టీ సాధించి అధికారం చేపడుతామన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

## పేదల సమస్యల పరిష్కారమే ధ్యేయం...

**అచ్చంపేట బీజేపీ నేత శ్రీకాంత్ భీమా**

**అచ్చంపేట, జూన్ 06 ప్రభాతవార్త:**పేద ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించి వారికి అండగా నిలిచి కష్ట సుఖాల్లో పాలు పం చుకోవడమే నా ఏకైక లక్ష్యమని అచ్చంపేట బీజేపీ నేత శ్రీకాంత్ భీమా పేర్కొన్నారు. అచ్చంపేట



మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెం దిన రాజ్యా కుటుంబానికి ఉండటానికి ఇల్లు లేక ఇబ్బంది పడుతున్న పరిస్థితిని తెలుసుకొని అచ్చంపేట బీజేపీ నేత శ్రీకాంత్ భీమా తన సొంత నిధులతో రాజ్యా కుటుంబం ఉండటానికి నిర్మిస్తున్న నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. త్వరితగతిన ఇంటి పనులను పూర్తి చేసి గృహ ప్రవేశం చేయించాలని సూచించారు.

## ఘనంగా యుగేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**దేవరకద్ర, జూన్ 06 ప్రభాతవార్త:** దేవరకద్రలో సోమవారం రాత్రి బీఆర్ఎస్ సీనియర్ యూత్ నాయకుడు, వార్డుసభ్యుడు యుగే ందం రెడ్డి జన్మదిన వేడుకలను యూత్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా యుగేందర్‌రెడ్డికి బీఆర్ఎస్ నాయకులు, యూత్ నాయకులు పూలమాలలువేసి శాలువాలతో సత్కరించారు. అలాగే కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జెట్టినరసింహ్మారెడ్డి, మాజీ అధ్యక్షుడు కుర్వకెంగూరి శ్రీకాంత్‌యాదవ్, మూడాసభ్యుడు కర్ణంరాజు, బీఆర్ఎస్ యూత్‌నాయకులు రాధాకృష్ణ, సయ్యద్‌జకీ, చెన్నప్ప, బండహన్మి రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్దకూడ యుగే ందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు.

## ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం...

**వెల్దండ, జూన్06 ప్రభాతవార్త:**రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంకుశ పాలన కొనసాగిస్తున్నారని, వ్యవస్థను అడ్డం పెట్టుకొని తెలంగాణ ప్రజల అకాంక్షను నీరు గారుస్తున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్ అన్నారు. సీఎం కేసీఆర్ నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటన నేపథ్యంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులను తెల్లవారుజామున వారి వారి నివాసాల వద్ద పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మోతిలాల్‌నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉందని, అరెస్టులతో ఎన్ని రోజులు పరిపాలన కొనసాగిస్తున్నారని ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాబోవు రోజుల్లో 6 నెలల్లో ప్రజారంజక పాలన కొనసాగిస్తామన్నారు. అనంతరం సొంతపూచీకత్తుపై అరెస్ట్ చేసిన వారిని విడుదల చేశారు. అరెస్ట్ అయిన వారిలో కాంగ్రెస్ నాయకులు శేఖర్, పర్వత్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మట్ట వెంకటయ్యగౌడ్, పుల్లయ్య, శ్రీనివాస్‌యాదవ్, రమేష్, కొండలుయాదవ్, గోపాల్‌నాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.



## కదలి రండి భారీ బహిరంగ సభను విజయవంతం చేయండి

**గ్రామ గ్రామాలలో ఇంటింటి సీఎం సభ ఆహ్వాన పత్రిక అందజేయాలి**



**గద్వాల ప్రతినిధి, జూన్ 06 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలోని గద్వాల మండల కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరయ్యారు. అదేవిధంగా జిల్లా మహిళా సమైక్య, మహిళా సంఘాలతో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈనెల 12వ తేదీన సీఎం కెసిఆర్ గద్వాల పర్యటన సందర్భంగా గద్వాల జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం, జిల్లా ఎస్పీ కార్యాలయం, బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవాలకు విచ్చేస్తున్నారు. అదేవిధంగా మధ్యాహ్నం 3 గం.లకు గద్వాల జిల్లా కేంద్రంలోని అయిజ రోడ్డు దగ్గర జరిగే భారీ బహిరంగ సభను 20 వేలకు పైగా మందిని బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు, ప్రజలు, రైతులు, మహిళలు గ్రామ గ్రామాల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సీఎం సభకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే ప్రజా ప్రతినిధులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, ఎంపిపి ప్రతాప్‌గౌడ్, వైస్ ఎంపిపి దామోదర్, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మాజిద్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు అశోక్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి, మహిళా సంఘాల అధికారులు, అధ్యక్షురాలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు రమేష్‌నాయుడు, గోపిరెడ్డి, హనుమంత్‌రెడ్డి, జయరాంరెడ్డి, లక్ష్మికాంత్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, సత్యనారాయణ, నీలేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, నీలేశ్వర్‌రెడ్డి, బీచుపల్లి, వెంకటరామిరెడ్డి, నర్సింహులు, సూరి, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## హజ్ యాత్రికులను సన్మానించిన మాజీ మంత్రి చిన్నారెడ్డి



**వనపర్తి టౌన్ , జూన్6, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ పవిత్ర హజ్ యాత్రికులను ఏఐసీసీ కార్యదర్శి, క్రమశిక్షణ కమిటీ చైర్మన్, మాజీ మం త్రి జి. చిన్నారెడ్డి మంగళవారం ఘ నంగా సన్మానించా రు. పవిత్రహజ్ యా త్రకు వెళ్తున్న ము స్లీం సోదరసో దరీ మణులకు కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు కిరణ్ కుమార్ అధ్యక్షతన శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి చిన్నారెడ్డి మాట్లాడుతూ... ఎంతో భక్తిశ్రద్ధలతో ఉండి మతాలకు అతీతంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అల్లాను ప్రార్థించడం వారి ఔదార్యానికి నిదర్శనం అని అన్నారు. వారి యాత్ర క్షేమంగా జరగాలని కోరుకుంటు అందరికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్క ముస్లీం తన జీవిత కాలంలో పవిత్ర హజ్ యాత్రను దర్శించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, పీసీసీ డెలిగేట్ కిరణ్‌కుమార్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు సమద్, అక్తర్, అనీస్, సమర్, వనపర్తి పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీలతరెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దివాకర్ యాదవ్, యూత్ ప్రధాన కార్యదర్శి బాబా, జిల్లెల ప్రవీణ్ కుమార్‌రెడ్డి , వెంకట్ నారాయణ, రోహిత్, పెంటన్న, నరహరి, సేవాదళ్ జాన్ నాయకులు ఖమర్‌మియా, ఎండి బాబా, సమద్, అక్తర్, జాన్, దస్తగిరి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు. కి రాములు, దిలీప్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచాలి

**జాగ చూపెట్టకుండా ఇండ్ల పట్టాలు ఎట్లా పంపిణీ చేస్తారంటూ అధికారుల నిలదీత..?**



**కెటిదొడ్డి, జూన్ 06 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పాగుంట, గువ్వలదిన్నె, ఎర్రందొడ్డి, కొండాపురం గ్రామాలలో ఇండ్లులేని నిరుపేదలకు ఇండ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కెటిదొడ్డి మండల రెవెన్యూ అధికారులు గ్రామాలలో నోటిఫికేషన్ వేశారు. ఆయా గ్రామాలలో ఇండ్లు లేని వారు, పేద, మధ్య తరగతి ప్రజలు, పంచాయతీ కార్యదర్శులకు జూన్ 1 నుంచి జూన్ 6 వరకు దరఖాస్తులు అందజేయాలన్నారు. అయితే కొండాపురం గ్రామంలో అధికారులు తూతూ మంత్రంగా చాటింపు చేయడంతో నిరుపేదలకు అర్థంకాక అయోమయంలో పడ్డారు. గడువు ముగిసింది. పేదలకు అన్యాయం జరిగినట్లే అంటూ అయోమయంలో పడ్డారు. ఇండ్లులేని నిరుపేదలకు కనీసం నోటిఫికేషన్ వేసినట్లు కూడా తెలియదంటూ, అర్హులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని నిరుపేదలు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా కొండపురం గ్రామంలో ప్లాట్లు చేయడానికి ప్రభుత్వ భూమి ఎక్కడా లేదని లేఔట్ చేయకుండా నిరుపేదలకు ఇండ్ల పట్టాలు ఎలా పంపిణీ చేస్తారని ప్రశ్నార్థకంగా మారింది. కొండపురం గ్రామంలో మండల ఆర్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సభను గ్రామస్తులు బహిష్కరించారు. దరఖాస్తు చేసుకోవడానికి సమయం పొడిగించాలని, ప్లాట్ల పంపిణీ చేసే ముందులే అవుట్‌లు చేసి గ్రామస్తులకు అందజేయాలని కోరారు.

## మాజీ మార్కెట్ ఛైర్మన్ నరసింహాగౌడ్ జన్మదిన వేడుకలు

**హాజరైన ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి రోగులకు పండ్లు, బెడ్లు పంపిణీ**



**నారాయణపేట ప్రతినిధి, జూన్ 06 ప్రభాతవార్త :** మక్తల్ మాజీ మార్కెట్ పి. నరసింహాగౌడ్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పడమటి ఆంజనేయస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరై గజమాలతో సత్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ మార్కెట్ కమిటి ఛైర్మన్ నరసింహాగౌడ్ ఇంటి దగ్గర జరిగిన జన్మదిన వేడుకల్లో మక్తల్, మాగనూరు కృష్ణ, నర్వ, ఉట్కూర్ మండలాల నుంచి అభిమానులు పెద్ద సంఖ్యతో తరలివచ్చి శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నారాయణపేట జిల్లా పరిషత్ ఛైర్మన్ వనజ ఆంజనేయులుగౌడ్, రాష్ట్ర ట్రేడ్ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ దేవర మల్లప్ప, టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొత్త శ్రీనివాస్ గుప్తా, మండల పార్టీ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు కావలి తాయప్ప, బిల్డర్ జుట్ల శంకర్, బండారి ఆనంద్, అశోక్‌గౌడ్, చెన్నయ్యగౌడ్, సర్పంచ్‌లు శ్రీనివాస్‌గౌడ్, కురువ హనుమంతు, వెంకటేష్‌గౌడ్, గాయత్రి అనిల్‌కుమార్, బాలు, మల్లేష్, జుట్ల మారుతి, పూజారి కురుమయ్య, గుడిగండ్ల నర్సిరెడ్డి, తిరుపతయ్య, కానాపురం వెంకటయ్యగౌడ్, మారుతి గౌడ్‌లతో పాటు వివిధ మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మున్సిపాలిటీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# బడిబాట షురూ..!

- ఈనెల 9వరకు బడిపిల్లల నమోదు
- 12నుంచి పాఠశాలలు పునర్‌ప్రారంభం
- ఈనెల 17వరకు ప్రత్యేక కార్యాచరణ..
- మన ఊరు మన బడితో పాఠశాలల సుందరీకరణ..

**విద్యకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నది. గురుకులాలు స్థాపించి కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నది. పౌష్టికాహారంతోపాటు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందిస్తున్నది. మన ఊరు మన బడి పథకం కింద వందలాది పాఠశాలలను అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దింది. పాఠశాలల్లో సన్నబియ్యంతోపాటు ఉచితంగా బుక్స్‌ను అందజేస్తున్నది. ఈక్రమంలో శనివారం నుంచి ప్రొ.జయశంకర్ బడిబాట కార్యక్రమం ప్రారంభమైంది. ఈనెల 12న పాఠశాలలు తెరుచుకోనుండగా ఈనెల 17వరకు అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.**

**- మహబూబ్‌నగరన్ ప్రతినిధి, జూన్6, ప్రభాతవార్త**

**మెరుగైన సర్కారు విద్యా, వసతులు..**

సర్కార్ బడి అంటే గతంలో పురుగుల అన్నం, కూలిపోయే తరగతి గదులు దర్శనమిచ్చేవి. కానీ తెలంగాణ వచ్చాక పరిస్థితి చాలా వరకు మారాయి. విద్యార్థులకు సన్నబియ్యంతో కూడిన భోజనంతోపాటు దుస్తువులు, పుస్తకాలు ఉచితంగా అందిస్తున్నది. గడేదాది మన ఊరు మన బడి పథకాన్ని తీసుకొచ్చి సర్కార్ బడులను సుందరకంగా తీర్చిదిద్దుతున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 7289 కోట్లు మంజూరు కాగా, మహబూబ్‌నగర్ జిల్లాకు మొదటి విడుదలో భాగంగా రూ.148 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. 291 పాఠశాలలను ఎంపిక చేయగా ఇప్పటివరకు 13 పాఠశాలలను ఆధునిక వసతులు, సౌకర్యాలతో ప్రారంభించారు. మిగతా పాఠశాలలో పనులు పురోగతిలో ఉన్నాయి.

**జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో..**

మహబూబ్‌నగర్ గ్రామీణ మండలంలోని రామచంద్రాపురం ప్రొఫెసర్ బడిబాట కార్యక్రమాన్ని డీఈవో రవీందర్ శనివారం ప్రారంభించారు. స్వయంగా విద్యాధికారి ఓ విద్యార్థిక యొక్క ప్రవేశపత్రం నింపి పాఠశాలలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మన ఊరు మన బడి పథకంలో భాగంగా కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఆంగ్ల బోధన ప్రారంభించిందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యా బోధన జరుగుతుందని, కావునా బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రాణెమ్మ, ఎంపీటీసీ లావణ్య, సమగ్రశిక్ష సమన్వయ కర్తలు బాలుయాదవ్ బైకాని, పల్లవి, శ్రీకాంత్, నాగేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయు రాలు భారతి, బాలపీర్ పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఇవీ కార్యక్రమాలు..**

- ఈనెల 3 నుంచి 9వరకు గ్రామాలు, ఆవాసా ప్రాంతాలల్లో ప్రత్యేక నమోదు కార్యక్రమం
- 12న పాఠశాలలను మామిడి తోరణాలు, ముగ్గులతో అలంకరించి పండుగ వాతావారణ ఉట్టిపడేలా తీర్చిద్దిద్దాలి. విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించాలి.
- 13న తొలిమెట్టు కార్యక్రమంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, తరగతులు, సబ్జెక్టుల వారీగా అభ్యసన స్థాయిని వివరించాలి.
- 14న విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించాలి. ప్రజాప్రతినిధులతో బాలసభలు నిర్వహించి విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలి. పాఠశాలల స్థాయి పిల్లలకమిటీలు, క్లబ్‌లు ఏర్పాటుచేసి బోధనా భ్యసనసామాగ్రితో ప్రదర్శన ఏర్పాటు చేయాలి.
- 15న ప్రత్యేక అవసరాల పిల్లల నమోదుపై దృష్టి పెట్టి , వైకల్యంతో బాధపడుతున్న వారికి పాఠశాలలు, భవిత కేంద్రాల్లో చేర్పించాలి




రామచంద్రాపురంలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న డీఈవో రవీందర్, ఉపాధ్యాయ బృందం (ఫైల్)

- 16న ఆంగ్ల మాధ్యమ తరగతుల నిర్వహణపై తల్లిదండ్రులకు విద్యార్థులకు అవగాహన కల్పించాలి.- 17న బాలికలకు విద్యాప్రాముఖ్యత, ఉన్నత చదువులపై అవగాహన కల్పించాలి. 10, ఇంటర్ పూర్తయిన విద్యార్థులు, తల్లిదండ్రులను పిలిపించి ఉన్నత విద్యాభ్యాసం కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించాలి.



రామచంద్రాపురంలో విద్యార్థి ప్రవేశ పత్రాన్ని పూర్తి చేస్తున్న డీఈవో రవీందర్ (ఫైల్)

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్సీ, మాజీ ఎంపి, ఎమ్మెల్యే

**చిన్నారుల భౌతికకాయానికి నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు.. మైనార్టీ కుటుంబాలను ఆదుకుంటామని వారికి హామీ..**





ఈతకు వెళ్లి నదిలో మృతి చెందిన చిన్నారుల భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి, ఢిల్లీ అధికార ప్రతినిధి మంద జగన్నాథం, ఎమ్మెల్యే విఎం అబ్రహాం

**ఇటిక్యాల, జూన్ 06 ప్రభాతవార్త :** మండల పరిధిలోని వల్లూరు గ్రామానికి చెందిన మైనార్టీ కుటుంబం ఇద్దరు అన్నదమ్ముల పిల్లలు సోమవారం కృష్ణానదిలో ఈతకు వెళ్లి నలుగురు చిన్నారులు మృతి చెందిన విషయం తెలిసిందే. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఢిల్లీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపి మంద జగన్నాథం, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం, బిఆర్ఎస్ పార్టీ అలంపూర్ నియోజకవర్గం మాజీ ఇంఛార్జి మంద శ్రీనాథ్‌లు మంగళవారం కర్నూలులోని వీకర్ సెక్షన్ కాలనీలో నివాసముంటున్న బాధిత కుటుంబాలను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఢిల్లీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపి మంద జగన్నాథం, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం, బిఆర్ఎస్ పార్టీ అలంపూర్ నియోజకవర్గం మాజీ ఇంఛార్జి మంద శ్రీనాథ్ వేరువేరుగా ఈతకు వెళ్లి మృతి చెందిన చిన్నారుల భౌతిక కాయాలకు వారు నివాలులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పి ప్రభుత్వ పరంగా ఆదుకుని ఆ కుటుంబాలకు అండగా ఉంటామని మైనార్టీ కుటుంబాలకు వారు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఢిల్లీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపి మంద జగన్నాథం, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం, ఆ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారు. అంతేకాక బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాంరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కిశోర్, రవిప్రకాష్, గిడ్డారెడ్డి, గిరిధర్‌రెడ్డి తదితరులు చిన్నారుల భౌతిక కాయాలకు నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు వారి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## మాన్‌దొడ్డి ప్రీమియర్ ఎంపిఎల్ లీగ్..!

**ఫైనల్‌కు హాజరై బహుమతులు అందజేసిన యువనాయకుడు శ్రావణ్‌కుమార్**



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

**అలంపూర్, జూన్ 06 ప్రభాతవార్త :** రాజోలి మండలం మాన్‌దొడ్డి గ్రామంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌కు రాష్ట్ర యువ నాయకుడు అలంపూర్ యువనేత డైనమిక్ లీడర్ శ్రావణ్ కుమార్ హాజరై మాట్లాడుతూ, యువత క్రీడలు అలవాటు చేసుకోవాలని, క్రీడలు ఆడటం వలన, ఆరోగ్యం బాగుంటుందని అదృష్టవంతుడు, ధనవంతుడు ఆరోగ్యం ఉన్నవారు మాత్రమే, ఆ ఆరోగ్యం ఆటలు ఆడటం వలన వస్తుందని అదేవిధంగా అలంపూర్ నియోజకవర్గంలో మీకు మా వంతు బాధ్యతగా, ఏ సమస్య వచ్చిన అండగా ఉంటామని, నియోజకవర్గంలో ప్రతి ఒక్క గ్రామంలో క్యాడేర్స్ ఉన్నాయి, మీకు మా క్యాడర్ మొత్తం ఏ అవసరం కావాల్సినా అండగా, సపోర్టుగా ఉంటుందని శ్రావణ్‌కుమార్ అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రూ. 20,016లు రెండవ బహుమతి సర్పంచ్ సవారి, మూడవ ప్రైజ్ శ్రీకాంత్‌రెడ్డి ఇవ్వడం జరిగింది. అదేవిధంగా స్థానిక ఎంపిటిసి, షీల్డ్ దాత హసన్, అదేవిధంగా స్థానిక నాయకులు నజీర్, గోనెశ్రీను, మందుల శ్రీను, మోహన్‌రెడ్డి, యువ నాయకులు శేషన్న, యేసు, లోకేష్‌నాయుడు, రాజ్‌తరుణ్, యోనా, అశోక్ తదితరులు హాజరై గెలిచిన విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. లీగ్‌వారు అతిథులకు సన్మానం చేశారు. ఇంత గొప్పగా విజయవంతంగా నడిపించిన ఎంపిఎల్ లీగ్ యాజమాన్యంకు, అందరిని సమన్వయం చేసి ముందుకు నడిపించిన హర్ష అందరు ధన్యవాదాలు తెలిపారు.

## ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

**- వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**వనపర్తి ప్రతినిధి, జూన్6, ప్రభాతవార్త:** దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 8వ తేదీన నిర్వహించనున్న ఊరూర చెరువుల పండుగ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళవారం పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి, దొడగుంటపల్లి చెరువులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఊరూరా చెరువుల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఇందుకు తగు ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. చెరువుల వద్ద ముళ్ల పొదలు తొలగించి , చెరువు కట్టపై శుభ్రపరిచి, చెరువులను అందంగా తీర్చిదిద్దాలని ఆయన తెలిపా రు. భారీ సంఖ్యలో బతుకమ్మ కోలాటం, డప్పు వాయిద్యాలతో చెరువుల వద్దకు చేరుకుని ఆనందోత్సహాలతోఈ వేడుకలను విజయవం తం చేయాలని అధికారులకు ఆయన సూచించారు. చెరువు వద్దకు వచ్చే వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బంది ఏర్పాట్లు చేయాలని ఆయన తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలని ఆయన అన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో వెబెక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... మహిళలు బతుకమ్మ కోలాటాలతో బయలుదేరి, చెరవు కట్ట వద్ద కట్ట మైసమ్మ పూజలు నిర్వహించి అనంతరం మంచి భోజనాలు ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెద్దమందడి తహసీల్దార్ సంధ్య, ఎంపీడీవో అఫ్జలుద్దీన్, వ్యవసాయ శాఖ ఏఈఓలు , క్లస్టర్ ఏఈఓలు, తదితరులు పాల్గొన్నారు.




పామిరెడ్డిపల్లి, దొడగుంటపల్లి చెరువులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

## మారెమ్మవ్వ జాతర బోనాలతో బయలుదేరిన మహిళలు

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 06 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీ దండు గ్రామంలో మంగళవారం అంగరంగ వైభవంగా దండు మారెమ్మవ్వ జాతర సందర్భంగా మహిళలు బోనాలతో ఆడపడుచులు బయలుదేరగా డోలు, తప్పెట్లు పూజారులు గ్రామంలో బోనాలకు స్వాగతం పలికారు. భక్తులు గ్రామపెద్దలు, యువకులు పెద్ద ఎత్తున ఊరేగింపుగా బయ లుదేరి దండు మారెమ్మ అవ్వను దర్శించుకుని మొక్కులు తీర్చుకు న్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ అచల రాజశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శాంతిరెడ్డి, పల్లెర్ల చెన్నప్ప, రాములు, కిష్టప్ప, నాగరాజు, వెంకటరెడ్డి, గుడి పూజారులు, గ్రామస్తులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నేడు చెరువు పండగపై అత్యవసర సమావేశం

**దేవరకద్ర, జూన్ 06 ప్రభాతవార్త :** తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా త్వరలో చేపట్టే చెరువు పండగను పురస్కరించుకుని బుధవారం మధ్యాహ్నం 12 గం.లకు స్థానిక గ్రామ పంచాయతీ వద్ద అత్యవసర సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ సిత్యానాయక్ తెలిపారు. ఈ సమావేశానికి అంగన్‌వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, మహిళా సంఘాల అధ్యక్షులు ఖచ్చితంగా పాటించాలని ఆయన కోరారు.

## గడప గడపకు ధర్మసమాజ్ పార్టీ



**నారాయణపేట ప్రతినిధి, జూన్ 06 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణంలో గడప గడపకు ధర్మసమాజ్ పార్టీ పరిచయ కార్యక్రమాన్ని ప్రారంభించి పరిచయం చేశారు. అదేవిధంగా డా. విశారద మహారాజ్ 10 వేల కి.మీ. స్వరాజ్య పాదయాత్ర ద్వారా ఎస్సీ, ఎస్టీ, బిసి మైనార్టీల ఐక్యత కోసం చేసిన సాహసోపేత పాదయాత్ర కోసం వివరిస్తూ పార్టీ ముఖ్య ఉద్దేశం వివరిస్తూ రాబోయే కాలంలో బిసి, ఎస్సీ, ఎస్టీ రాజ్యాన్ని ధర్మసమాజ్ పార్టీ ద్వారా నిర్మించుకోబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నారాయణపేట జిల్లా ధర్మసమాజ్ పార్టీ ప్రచార కమిటి నాయకులు దేవిడ్, ఈశ్వర్, ఓబులేష్, సూర్యకళ, పద్మ, తిమ్మరాజు, చక్రవర్తి, వీరేష్, జగదీష్, నర్సింలు పాల్గొన్నారు.

## ప్రగాఢ సానుభూతి తెలిపిన అలంపూర్ ఎమ్మెల్యే

**అలంపూర్, జూన్ 06 ప్రభాతవార్త :** వడ్డేపల్లి మండలం జక్కిరెడ్డిపల్లి గ్రామ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రవిరెడ్డి చిన్నాన్న కుమారుడు అయిన శ్రీనివాస్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ మరణించాడు. విషయం తెలుసుకున్న అలంపూర్ ఎమ్మెల్యే డా. విఎం అబ్రహాం వారి ఇంటికి వెళ్లి వారి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వెంకటాపురం గ్రామంలో దేవర చెరువు పరిశీలన

**కెటిదొడ్డి, జూన్ 06 ప్రభాతవార్త :** మండల పరిధిలోని మంగళవారం వెంకటాపురం గ్రామ పంచాయతీలో ఉన్న దేవర చెరువును గ్రామ సర్పంచ్, ఎంపిడిఓ కలిసి 8వ తేదీన జరగబోయే చెరువుల పండగ సందర్భంగా దేవర చెరువును పరిశీలించడం జరిగింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆంజనేయులు, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి మహ్మద్ ఆజార్‌మోహిద్దిన్, నీటి పారుదల డీఈ రాంకిశోర్, ఏఈ లక్ష్మీనారాయణ, లోక్యానాయక్, వర్క్ ఇన్స్‌పెక్టర్, ఉపసర్పంచ్, గ్రామ సెక్రటరీ, వెంకటాపురం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మహేష్ గౌడ్ కుటుంబానికి ఆర్థిక సహాయం

**చిన్నంబావి, జూన్6, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని అమ్మాయిపల్లి గ్రామంలో విద్యుత్ శాఖలో కాంట్రాక్టు మీటర్ రీడర్‌గా పని చేస్తున్న మహేష్‌గౌడ్ ఆటో ఢీకొట్టడంతో అదేసమయంలో రోడ్డు పక్కన రైతు పొలంలో వ్యర్థాలకు నిప్పుపెట్టడంతో ఆమంటల్లో ఎగిరిపడి కాలి సజీవదహనం అయ్యాడు. అదిచూసి చలించిన తోటి ఉద్యోగులు రూ41వేలు ఆర్థికసహాయంగా అందించారు. ఈఆర్థిక సహాయానికి సహకరించిన ఏడి, ఏఈ , కాంట్రాక్టు మీటర్ రీడర్స్ అందరూ పాల్గొన్నారు.

## డెలివరీ భాయ్ స్కామ్



**వీపనగండ్ల, జూన్6, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో మంగళవారం స్థానిక ఎస్ఐ రామన్ గౌడ్ సైబర్ నేరగాళ్ల గురించి ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజు రోజుకు సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారని అన్నారు. అదే విధంగా మీరు ఆర్డర్ చేయకుండానే మీకు ఆన్‌లైన్‌లో ఆర్డర్ వచ్చిందని డెలివరీ భాయ్ వస్తే ఖచ్చితంగా స్కాం అని గుర్తించాలని, మీకు ఎవరో ఆర్డర్ పంపారు అని మీకు మొబైల్ కు వచ్చిన ఓటీపీ చెప్పమని అడిగితే చెప్పకండి అని , మీకు తెలియకుండానే మీకు ఎలాంటి ఆర్డర్ రాదు అని, అది ఖచ్చితంగా మోసమే అని గ్రహించాలని అన్నారు. సైబర్ మోసాలకు ఒక్క అడుగు దూరంగా ఉండండి అని, డెలివరీ భాయ్స్ వస్తే జాగ్రగ్గా ఉండాలని ఎస్ఐ ప్రజలు తెలిపారు.

# పురాతన బావులను సంరక్షించడానికి ప్రభుత్వం కృషి చేస్తుంది:జిల్లా కలెక్టర్

**గద్వాల ప్రతినిధి, జూన్ 06 ప్రభాతవార్త :** జిల్లాలో ఉండే పురాతన బావులను సంరక్షించి వర్షపు నీటిని ఆదా చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌కు చెందిన ది రైన్ వాటర్ ప్రాజెక్టు సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో ఉండే పురాతన బావులను పరిశీలించారు. పురాతన బావుల సంరక్షణ నీటి నిల్వ గురించి సంస్థ ప్రతినిధి కల్పనా రమేష్ తమ సంస్థ ద్వారా పురాతన బావుల సంరక్షణ, వర్షపు నీటి ఆదా చేయుట గురించి కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా గద్వాల పట్టణంలోని నది అగ్రహారం రోడ్డు ఆంజనేయస్వామి గుడిపక్కలో గల పురాతన బావిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పట్టణంలోని పురాతన బావులను సంరక్షించి వర్షపు నీటిని సంరక్షించడం, ఆర్చి నుండి ముఖద్వారం దగ్గర మెట్లు కనిపించే వరకు మట్టి తీసివేయాలని, బావిలో పూడిక తీయుట, కంపచెట్లను తొలగించి మొత్తం క్లీన్ చేసి ప్లాంటేషన్ చేయుటకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని పురాతన బావుల సంరక్షణ వర్షపు నీటి సంరక్షణ కొరకై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నర్సింలు, ది రైన్ వాటర్ ప్రాజెక్టు హైదరాబాద్ కల్పన రమేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




పురాతన బావులను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

## 11న తెలంగాణ సాహిత్య దినోత్సవం కలెక్టర్



**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 06 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 11న తెలంగాణ సాహిత్య దినోత్సవం వేడుకలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ తెలిపారు. ఈ వేడుకలలో భాగంగా కవి సమ్మేళనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈనెల 11న (ఆదివారం) మహబూబ్‌నగర్‌లోని శిల్పారామంలో ఈ కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని ఈ కవి సమ్మేళనంలో పాల్గొనే కవులు, రచయితలు, సాహితీ వేత్తలు మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వారై ఉండాలని, తెలుగు, ఉర్దూ కవులు అందరు ఈ కవి సమ్మేళనంలో పాల్గొనవచ్చని తెలిపారు. కవితలు 20 పంక్తులు, గరిష్టంగా 26 పంక్తులకు మించకుండా ఉండాలన్నారు. తెలంగాణ అస్తిత్వం,తెలంగాణ ప్రగతి అనే కవితాంశంతో కవితలు ఉండాలన్నారు. కవులు పంపించే కవితలు ఇంతకు ముందు దినపత్రికలు, వారపత్రికలు, పుస్తకాలలో ప్రచురించబడి ఉండకూడదన్నారు. కవులు తమ కవితలను ఈ నెల 9న సాయంత్రం 5 గం.ల వరకు వాట్సాప్ నంబర్8247301883కు వారి పేరు, చిరునామా, మొబైల్ నంబర్‌తో సహా పంపాలని కోరారు. కవులు తమ కవితలను పంపించేటప్పుడు వాట్సాప్‌లో టైప్ చేసి పంపాలని లేదా స్పష్టంగా అర్థమయ్యే విధంగా రాత పూర్వకంగా పంపాలని తెలిపారు. ఒక కవి లేదా కవయిత్రి ఒక కవితను మాత్రమే పంపించాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, జిల్లాకు చెందిన ప్రముఖులు ఈ కవి సమ్మేళనానికి హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

## స్వచ్ఛంద రక్తదానం పలువురికి ఆదర్శం ..

**- ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్ కుమార్**



**వనపర్తి వైద్య విభాగం, జూన్6, ప్రభాతవార్త:** ఆపదలో ప్రాణపాయ స్థితిలో ఉన్న వారికి స్వచ్ఛందంగా రక్తదానం చేయడం పలువురికి ఆదర్శం అవుతుందని జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గల రక్తనిధి కేంద్రంలో తిరుపతి బాబు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన తిరుపతి బాబును సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రకుమార్ తో పాటు రెడ్‌క్రాస్ చైర్మన్ ఖాజా కుతుబుద్దీన్ అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ... తన 43వ పుట్టిన రోజు సందర్భంగా సాంకేతిక నిపుణులు ఎస్. తిరుపతి బాబు స్వచ్ఛందంగా ఐదవ సారి రక్తదానం చేయడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెం డెంట్ నరేంద్రకుమార్ , తిరుపతి బాబును ఘనంగా సన్మానించి అభినందించారు. అర్హులైన యు వతీ యువకులు తిరుపతి బాబును స్ఫూర్తిగా తీసుకుని తమ తమ పుట్టిన రోజు సందర్భంగా స్వచ్ఛందంగా రక్తదానం చేసి, రక్తం అవసరం ఉన్న వారిని ఆదుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మనన ఖాజా కుతుబుద్దీన్, ఆర్‌ఎంవో ప్రమోద్ కుమార్, రక్తనిధి కేంద్ర పర్యవేక్షకులు లక్ష్మిపతి, సాంకేతిక నిపుణులు శ్రీనివాసులు, ఎస్‌కె మహమూద్, ఎండి పాషా, కేతావత్ కార్తిక్, రమేష్, ఇఫ్తాకర్, అలి, నందిని, శశికళ, అంభికా, గౌరీ లలిత తదితరులు పాల్గొన్నారు.

## భార్యను కొట్టి చంపిన భర్త..



మృతురాలు లక్ష్మమ్మ

**లింగాల, జూన్ 06 ప్రభాతవార్త :** రాయవరం గ్రామ శివారులోని వాగు దగ్గర రాయితో కొట్టి చంపిన సంఘటన చోటు చేసుకుంది. ఏదుల పర్వతాలు తన భార్య అయిన లక్ష్మమ్మ (35)ను కొట్టిచంపిన సంఘటన మండలంలోని ధారారం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ధారారం గ్రామానికి చెందిన ఏదుల పర్వతాలు పెంట్లవెల్లి మండలం మల్లేశ్వరం గ్రామానికి చెందిన లక్ష్మమ్మను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారని, 15 సంవత్సరాల క్రితం లక్ష్మమ్మ భర్తను వదిలి వెళ్లింది. గత 11 ఏళ్ల క్రితం పర్వతాలు కృష్ణవేణి రెండో వివాహం చేసుకున్నాడు. రెండవ భార్య అయిన కృష్ణవేణితో కలిసి ధారారం గ్రామంలో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో పర్వతాలు గత 3 నెలల క్రితం బతుకు దెరువు కోసం హైదరాబాద్ వెళుతున్నాని చెప్పి వదిలేసిన మొదటి భార్య లక్ష్మివద్దకు వెళ్లి ఇద్దరు వికారాబాద్ జిల్లా తాండూరులో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ధారారం గ్రామంలో బొడ్రాయి పున: ప్రతిష్ట ఉత్సవాలలో భాగంగా మంగళవారం బోనాల పండగలో పాల్గొనడానికి తాండూరు నుంచి లక్ష్మమ్మ పర్వతాలు సోమవారం సాయంత్రం లింగాలకు వచ్చారు. కొడుకు చేత బైక్ తెప్పించుకున్న పర్వతాలు లక్ష్మమ్మను తీసుకుని అంబట్‌పల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం రాత్రి ఆమెను తీసుకుని యాపట్ల మార్గాన ధారారం గ్రామానికి మార్గమధ్యలో రాయవరం సమీపంలోని బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. ఇద్దరి మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తడంతో ఆవేశంతో ఆమెను పర్వతాలు రాయితో కొట్టడంతో లక్ష్మమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మంగళవారం రోజున సంఘటన స్థలానికి పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతురాలి అక్క ఏదుల జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ అనుదీప్ పర్యవేక్షణలో ఎస్సై శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

## గద్వాల అనగానే నేసిన చీరలకు బ్రాండ్‌గా మారింది..!

మొదటి పేజీ తరువాయి భాగం...



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్

టిఎస్ ఐపాస్ ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు రూ. 2325 కోట్ల పెట్టుబడితో 116 యూనిట్లకు అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. తద్వారా 2152 ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందని, టి ఐడియా పథకం కింద జిల్లాలో 147 దరఖాస్తులకు గాను 10.53 కోట్ల రాయితీ మంజూరు చేయడం జరిగిందన్నారు. టిప్రైడ్ పథకం కింద జూన్ 2014 నుండి మార్చి 2023 వరకు ఎస్సీలకు 387 యూనిట్లకు గాను 19.33 కోట్లు, ఎస్టీలు 61 యూనిట్లకు గాను 3.52 కోట్లు, దివ్యాంగులు 34 యూనిట్లకు గాను, 1.53 కోట్ల రాయితీని మంజూరు చేయడం జరిగిందన్నారు. చేనేత రంగంలో మనజిల్లా ముందంజలో ఉందన్నారు. ముద్ర రుణాల మంజూరు రికవరీలో జిల్లా ముందంజలో ఉందన్నారు. చేనేత కార్మికులకు చేనేత భీమా చేనేత భీమా ద్వారా ప్రమాదం జరిగి మరణిస్తే ఐదు లక్షల చొప్పున 11 మందికి 55 లక్షలు నేరుగా వారి ఖాతాలో జమచేయడం జరిగిందని తెలిపారు. మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా సంక్షేమ పథకాల బెనిఫిట్ పొందాలని తెలిపారు. ప్రభుత్వ బుక్లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ చేనేత కార్మికులుగా ఎంపికైన 5 మందికి శాలువాలతో సన్మానం చేశారు. మీసేవ సెంటర్లు నిర్వహించిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అభివృద్ధి అధికారి యాదగిరి, చేనేత అభివృద్ధి అధికారి గోవిందయ్య, వ్యవసాయ శాఖ అధికారి గోవింద్‌నాయక్, పశు సంవర్ధకశాఖ అధికారి వెంకటేశ్వర్లు, చేనేత కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

## నూతన పారిశ్రామిక ఔత్సాహికులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది..

మొదటి పేజీ తరువాయి భాగం..



చేనేత దుస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్

ఔత్సాహికులు పరిశ్రమలు నెలకోల్పేందుకు ముందుకు రావాలని ఆయన సూచించారు. పరిశ్రమల రంగం అభివృద్ధికి కృషి చేస్తున్న పరిశ్రమల శాఖ అధికారులకు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ చేతితో తయారు చేసిన వివిధ రకాల వస్త్రాలను, వస్తువులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్, పరిశ్రమల శాఖ అధికారి యాదగిరి, డీఆర్‌డీవో నరసింహులు, రాజరాజేశ్వరి, బయో ఫ్యూయల్ బ్రికెట్ మేనేజింగ్ పార్ట్‌నర్ రాజశేఖర్, హ్యాండ్ లూమ్ అసిస్టెంట్ డెవలప్‌మెంట్ అధికారి రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా అధికారులు, చేనేత కార్మికులు, పారిశ్రామిక ఔత్సాహితులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పేపర్ ప్లేట్స్‌ను పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్, జిల్లా కలెక్టర్

# వనపర్తి బీఆర్ఎస్‌లో ఆగని వలసలు..!

- పెద్దమందడి మండలంలో ఆరు గ్రామాల పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, యువజన విభాగం బీసీ సెల్ నాయకులు రాజీనామాలు
- ఆత్మాభిమానం చంపుకుని ఇమడలేకపోతున్నాం
- కలిసికట్టుగా ఉండి నిరంజన్‌రెడ్డిని ఓడించి మేఘారెడ్డిని గెలిపిద్దాం
- మేఘారెడ్డి సమక్షంలో భారీగా చేరికలు



మేఘారెడ్డి సమక్షంలో చేరుతున్న పెద్దమందడి బీఆర్ఎస్ నాయకులు



బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన పత్రాలను చూయిస్తున్న నాయకులు

**వనపర్తి ప్రతినిధి, జూన్6, ప్రభాతవార్త:** వనపర్తి బీఆర్ఎస్‌లో వలసల పరంపర కొనసాగుతుంది. పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి వనపర్తి ఎంపీపీ కిచ్చారెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన అనంతరం నియోజకవర్గంలో వినూత్న పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పలు మండలాలకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆ పార్టీని వదిలి మేఘారెడ్డి వర్గంలో చేరుతున్న నేపథ్యంలో మంగళవారం పెద్దమందడి మండలంలో బీఆర్ఎస్‌కు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామ పార్టీల అధ్యక్షులు, గ్రామాల రైతుబంధు అధ్యక్షులు, మాజీ సర్పంచులు, యువజన విభాగం బీసీ సెల్ నాయకులు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి వనపర్తి జిల్లా కేంద్రంలో మేఘారెడ్డి సమక్షంలో చేరారు. మద్దిగట్ల మాజీ సర్పంచ్ పుట్టమోని నారాయణ, అమ్మపల్లి బాలు, మనిగిల్ల సుంచరమోని వెంకటయ్య, జగత్‌పల్లి గట్టుయాదవ్, యువజన విభాగం బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మహేష్ మాట్లాడుతూ... ఆత్మాభిమానం చంపుకోలేక బీఆర్ఎస్ పార్టీని వీడాల్సి వస్తుందని నియోజకవర్గ నాయకులు కార్యకర్తలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమం సమయం నుండి పార్టీలో కొనసాగామని , అధికారంలోకి వచ్చిన తరువాత బీఆర్ఎస్ నాయకులు తమను ఏమాత్రం పట్టించుకోవడం లేదని పార్టీలో కొనసాగుతున్నప్పటికీ ఎక్కడ గుర్తింపు లేదని కేవలం కొంతమందికి మాత్రమే బీఆర్ఎస్ పార్టీలో పదవులు, కాంట్రాక్టులు వస్తున్నాయి తప్పా నిజాయితీగా పని చేసే బీఆర్ఎస్ కార్యకర్తలకు గుర్తింపు రావడం లేదని కనీసం పట్టించుకోవడం లేదని వారు అంసతృప్తి వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీలో తమకు భవిష్యత్ లేదన్న విషయాన్ని గమనించి ఆ పార్టీని వీడి మేఘారెడ్డి సమక్షంలో పని చేసి ఆయనను ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు ముందుకు వచ్చామని వారు పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఒక్కరు కలిసి కట్టుగా పని చేస్తే నిరంజన్‌రెడ్డిని ఓడించడం పెద్ద కష్టమేమి కాదని నియోజకవర్గంలో పెద్దఎత్తున మంత్రి నిరంజన్‌రెడ్డిపై వ్యతిరేకత ఉందని అవినీతి అక్రమాలతో దోచుకుంటున్నారని వనపర్తి ప్రజలు ఈఎన్నికల్లో నిరంజన్‌రెడ్డిని ఓడించడం ఖాయమని వనపర్తి ఎంపీపీ కిచ్చారెడ్డి పేర్కొన్నారు. మేఘారెడ్డి గెలుపు కోసం ప్రతి కార్యకర్త అహర్నిశలు పని చేయాలని మేఘారెడ్డి వర్గంలో చేరే వారికి అధికార బీఆర్ఎస్ పార్టీ నాయకులు కేసుల పేరుతో భయబ్రాంతులకు గురి చేయడం చేస్తారని వాటికి కార్యకర్తలు , నాయకులు అధిగమించి నిలబడాలని వారు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన వారిలో

1. వీరాయిపల్లి బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు చిట్యాల వెంకటయ్య,
2. మనిగిల్ల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సుంచరమోని వెంకటయ్య
3. దొడగుంటపల్లి బీఆర్ఎస్ అధ్యక్షుడు సుదర్శన్
4. మంగంపల్లి బీఆర్ఎస్ అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి
5. సోషల్ మీడియా మండల కన్వీనర్ అమ్మపల్లి బీఆర్ఎస్ అధ్యక్షులు బాలు
6. ముందరితాండ బీఆర్ఎస్ అధ్యక్షుడు సక్రు నాయక్
7. అల్వాల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శేఖర్ రెడ్డి
8. బీఆర్ఎస్ పెద్దమందడి మండల తాపీ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు బాలకిష్టయ్య
9. వనపర్తి 11వ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు నందిపేట తిరుపతయ్య యాదవ్
10. మద్దిగట్ల మాజీ సర్పంచ్ , మండల బీఆర్ఎస్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పుట్టమోని నారాయణ
11. మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు మహేందర్ గౌడ్
12. గట్లఖానాపురం మాజీ సర్పంచ్ చింతకాయల వెంకటేష్
13. మండల బీసీ సెల్ అధ్యక్షుడు గట్టు యాదవ్
14. మణిగిల్ల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకటేష్
15. చల్లాఘణపురం మండలం మహమ్మద్ హుస్సేన్‌పల్లి బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు శశివర్ధన్‌రెడ్డి
16. మనిగిల్ల బాల్‌రెడ్డి
17. వెల్టూరు బీఆర్ఎస్ ఉద్యమ నాయకులు వివేక్
18. మంగంపల్లి రైతు సంఘం అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి
19. పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రవీణ్ రెడ్డి
20. దొడగుంటపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నిరంజన్ లతో పాటు మరో 40 మంది కార్యకర్తలు



పార్టీలో చేరిన వారిని ఉద్దేశించి మాట్లాడుతున్న మేఘారెడ్డి

బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు వారు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మేఘారెడ్డి మాట్లాడుతూ... అతి తక్కువ సమయం ఉన్నందున తనకు మద్దతు ఇచ్చి తన వెంట నడిచేందుకు ముందుకు వచ్చిన వారికి పేరు పేరునా ధన్యవాదాలు తెలుపుతున్నానని, కలిసికట్టుగా ఎన్నికల వరకు పని చేస్తే ఐదేళ్ల పాటు మీ కోసం తాను పని చేసి నియోజకవర్గ ప్రజలకు 365 రోజులలో 24 గంటల పాటు అందుబాటులో ఉంటానని మేఘారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జల్లాఘణపురం నాయకులు సాయిచరణ్ రెడ్డి, పెద్దమందడి సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ఐ.సత్యారెడ్డి, కౌన్సిలర్లు రాధాకృష్ణ, బ్రహ్మం, వెంకటేష్, చల్లాఘణపురం మాజీ జడ్పీటీసీ రమేష్ గౌడ్, సర్పంచులు రాధాకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ రఘు ప్రసాద్, గట్లఖానాపురం ఎంపీటీసీ దామోదర్, మణిగిల్ల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రామచంద్రయ్య గౌడ్, మోజర్ల రామకృష్ణారెడ్డి, జగత్‌పల్లి సింగిల్‌విండో డైరెక్టర్ మన్యంకొండ యాదవ్, నందిపేట తిరుపతయ్య యాదవ్, శివ యాదవ్ తదితరులు ఉన్నారు.

# వలసల నుండి అభివృద్ధిలో పాలమూరు..!







**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 06 ప్రభాతవార్త :** తొమ్మిదేళ్లలో తెలంగాణ అద్భుత ప్రగతిని సాధించిందని అదే స్ఫూర్తితో చిరునవ్వులు చిందించే తెలంగాణ కోసం ముందుకు సాగుదామని ముఖ్యమంత్రి కెసిఆర్ పేర్కొన్నారు. వలసలు, కరువులు బొంబాయి బస్సులకు నెలవైన ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇప్పుడు అద్భుతాలు జరుగుతున్నాయని పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని 100శాతం పూర్తి చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 9 సంవత్సరాలు పూర్తి చేసుకుని 10 సంవత్సరంలోకి అడుగు పెడుతున్న వేళ తెలంగాణ రాష్ట్రం అనేక రంగాలలో అగ్రగామిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో రూ. 62 కోట్ల వ్యయంతో నిర్మించిన సమీకృత జిల్లా అధికారుల భవనాన్ని ప్రారంభించారు. అంతే కాకుండా రూ.38.5కోట్ల వ్యయంతో నిర్మించిన జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఉయ్యాలవాడ సమీపంలో 25 ఎకరాల విస్తీర్ణంలో రూ. 166 కోట్లవ్యయంతో నిర్మించనున్న నాగర్‌కర్నూల్ ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఐడిఓసి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ఎటు చూసినా ఎండిపోయిన చెరువులు, వాగులు, వంకలు కనబడేవని ఈ ప్రాంతానికి చెందిన గోరెటి వెంకన్న సహజ కవి వాగులు, వంకలపై, దుందుబినదిపై, కరువుపై ఎన్నోకవితలు రాశారని ఇప్పుడు హెలిక్యాప్టర్‌లో నాగర్‌కర్నూల్‌కు వస్తుంటే చెక్‌డ్యాంలలో, చెరువులలో నీరు కనబడుతుంటే ఎంతో సంతోషంగా ఉందన్నారు. గతంలో ఉమ్మడి పాలమూరు జిల్లా మీదుగా వెళ్లే సమయంలో అడవులు కూడా పలచబడి పోయిన సంఘటనలు ఉండేవని అలాంటిది ఇప్పుడు కల్వకుర్తి నియోజకవర్గంలోనే లక్షల ఎకరాల వరకు సాగు నీరు అందిస్తున్నామని గుర్తు చేశారు. ఒకప్పుడు ఉమ్మడి పాలమూరు జిల్లా కరువులు, వలస బొంబాయి వలసలు అలవమైందని అలాంటి పాలమూరులో ఇప్పుడు అద్భుతాలు జరుగుతున్నాయన్నారు. ఇంతటి అభివృద్ధి సాధించిన ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి కారణం ఇక్కడి ప్రజలే అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సాగు, తాగునీరు, విద్యుత్ సమస్యలు తీరిపోయాయని, తలసరి ఆదాయం పెరిగిపోయిందని, రాష్ట్రానికి ఎన్నో అవార్డులు వచ్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఐటి రంగంలో దేశంలో రెండు ఉద్యోగాలు వస్తే అందులో ఒకటి ఖచ్చితంగా తెలంగాణకు దొరుకుతుందని 50 శాతం ఐటి ఉద్యోగాలు హైద్రాబాద్ సిటీనుండి వస్తున్నాయని అన్నారు. 9 సంవత్సరాలు దాటి 10వ సంవత్సరంలో అడుగిడుతున్న తెలంగాణ రెండేళ్లు కరోనాతో అతలాకుతలంగా, కేవలం ఆరున్నర సంవత్సర కాలంలో ఎవరు ఊహించని విధంగా అభివృద్ధి సాధించిందని దీనికి కారణం ఉద్యోగులు, అధికారులేనని వారిని అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్రం హోంమంత్రి మహ్మద్ అలీ, మంత్రి ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, డిజిపి అంజినికుమార్‌గౌడ్, ఎంపి రాములు, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజ్, ఎమ్మెల్సీలు గోరెటి వెంకన్న, కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, జైపాల్‌యాదవ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, అబ్రహాం, జిల్లా నలుమూలల నుండి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**తెలంగాణ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర అభినందనీయం:ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు**

తెలంగాణ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర అభినందనీమని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయాన్ని, జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కొల్లాపూర్ చౌరస్తాలో రూ. 62.2 కోట్లతో నిర్మించిన సమీకృత కార్యాలయాల సముదాయాన్ని సర్వమత ప్రార్థనలతో ప్రారంభించారు. కలెక్టర్ చాంబర్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్, కలెక్టర్ ఉదయ్‌కుమార్‌ను కుర్చీలో కూర్చోబెట్టారు. మూడు సార్లు లేపికూర్చోబెట్టిన అనంతరం కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సర్వమత ప్రార్థనలు చేయించారు. జిల్లా ప్రజలకు మంచి పరిపాలన అందించి జిల్లాను అగ్రస్థానంలోనిలబెట్టాలని సూచించారు. అనంతరం సమీకృత కార్యాలయ సముదాయాన్ని అహర్నిశలు వెంట ఉండి కష్టపడి చక్కటి నిర్మాణం చేసినందుకు, రోడ్లు, భవనాల శాఖ అధికారులను శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్, ముఖ్యమంత్రి కెసిఆర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, డిజిపి అంజనికుమార్ యాదవ్‌లను శాలువాలతో సన్మానించారు.



# పాలమూరు బంగారు తునక..!





మొదటి పేజీ తరువాయి భాగం..

మోడల్ కావాలని దేశం మొత్త కోరుకుంటున్నదని, మీ ఆశీర్వాదంతోనే దేశ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. అంతకముందు సభాధ్యక్షత వహించిన ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమం మొత్తం దేశం విస్తరించాలన్నారు. అందరికీ సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందాలంటూ దేశానికి నాయకుడు అవసరం అది కేసీఆర్ వల్లే సాధ్యమన్నారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు, విప్ గువ్వల బాలరాజు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రసంగించారు. కరువు పారద్రోలేందుకు పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం తీసుకొచ్చారని తెలిపారు. 2014 తర్వాత వలసలు వాపస్ వచ్చాయన్నారు. బీమా, సంగంబండ, జూరాల, కల్వకుర్తి, తుమ్మిళ్ల, గట్టు ఎత్తిపోతల పథకాలు ప్రారంభించుకొని లక్షల ఎకరాలకు సాగునీరు పారించామన్నారు. సీఎంకు పాలమూరు ప్రజలు రుణపడి ఉన్నారని పేర్కొన్నారు. కాళేశ్వరం మాదిరిగా పాలమూరు ఎత్తిపోతల పథకం పూర్తి 12లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. నాగర్‌కర్నూల్ జెడ్పీ చైర్‌పర్సన్ శాంతికుమారి మాట్లాడుతూ తాగునీటి గోస తీర్చి, మహిళల సంక్షేమానికి పెద్ద ఎత్తున పథకాలు అమలు చేస్తున్న కేసీఆర్ సార్‌కు ధన్యవాదాలు అన్నారు.





